క్లుప్తంగా

ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేద్దాం

బద్వేలు అర్బన్ : ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోడపాటి రామసుబ్బారెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్‌వర్కర్ స్కీం ఆధ్వర్యంలో శుక్రవారం తిరువెంగళాపురం సచివాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఐవీ సురక్షితం కాని లైంగిక సంబంధాల ద్వారా, కలుషిత సూదుల ద్వారా సోకుతుందన్నారు. కార్యక్రమంలో లింక్‌వర్కర్ స్కీం సూపర్‌వైజర్ దర్బార్‌వలి, వీఆర్‌ఓ శివకుమార్, సీహెచ్‌ఓ హర్షిత, మహిళా సంరక్షణ కార్యదర్శి సుజాత, సచివాలయ సిబ్బంది, ఆర్బీకే సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

డ్రైడే–ఫ్రైడే పాటించాలి



మురికినీరు నిల్వ ఉన్న చోట అబేట్ ద్రావణాన్ని చల్లుతున్న వైద్య సిబ్బంది

బి.కోడూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే మరియు ఫ్రైడే పాటించాలని వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్ తెలిపారు. మండలంలోని బి.కోడూరులో తమ సిబ్బందితో కలిసి గ్రామంలో మురికినీటి నిల్వలను పరిశీలించి అబేట్ ద్రావణం చల్లించాలని, అలాగే గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బద్వేలు సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ, సీహెచ్‌ఓ నాగమణి, పీహెచ్‌ఎన్ పుష్పాంజలి, సూపర్‌వైజర్ జాన్‌విలియం, హెల్త్‌అసిస్టెంట్ రామతీర్థం, ఏఎన్‌ఎం కుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సిమెంట్‌రోడ్డు పనులు ప్రారంభం



సిమెంట్‌రోడ్డు పనులకు పూజ చేస్తున్న సర్పంచ్ రమణారెడ్డి

బద్వేలు : పోరుమామిళ్ల మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, టేకూరుపేట సర్పంచ్ కల్లూరు రమణారెడ్డి శుక్రవారం టేకూరు పేటలో సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. రూ.20లక్షలతో పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు, డ్రైనేజ్ పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ బాలసుబ్రమణ్యం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సుగంధ ద్రవ్యాలతో వాసవీమాత అలంకరణ



వేంపల్లె : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ధనుర్మాస పూజలలో భాగంగా శుక్రవారం అమ్మవారిశాలలో ఆర్యవైశ్య, ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు వాసవీ మాతను యాలక, లవంగాల సుగంధ ద్రవ్యాలతో విశేష అలంకరణ చేశారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, నైవేద్యం, ప్రాకారోత్సవం నిర్వహించి అమ్మవారికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షుడు హరికృష్ణ, ఆర్యవైశ్య మహిళా మండలి ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల సేవలను విస్తృతం చేయాలి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు అందించాలని సత్సంకల్పంతో ఏర్పాటు చేసిన సచివాలయాల సేవలను విస్తృతం చేయాలని రాష్ట్ర ఉద్యాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డిలు తెలిపారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు కమలాపురం మండల సచివాలయాల కన్వీనర్ల సంఘం మండల కన్వీనర్‌గా సుమిత్రా రాజశేఖర్‌రెడ్డిని, పట్టణ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడిగా నిఖిల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం వారిని ఘనంగా సత్కరించారు. డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, మస్తానయ్య, రామసుబ్బారెడ్డి, మర్రి సుబ్బన్న, చిన్ని, మైసూరారెడ్డి పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



సీబీఐటీలో భోగి మంటలను తిలకిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



హరిదాసుతో సంబరాలు చేస్తున్న సీబీఐటీ విద్యార్థులు

సీబీఐటీ సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని.. మూడేళ్లుగా కరోనాతో సంతోషంగా జరుపుకోని సంక్రాంతి పండుగను ఈ సారి ప్రజలందరూ ఘనంగా జరుపుకోవాలని, ప్రతి ఒక్కరికీ శుభాలు చేకూరాలని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. చాపాడు మండల పల్లవోలు వద్ద ఉన్న సీబీఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ట్రెడిషనల్ డే పేరుతో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఇంటికి వచ్చిన వేళ ఇంటిల్లి పాది సంతోషంగా జరుపుకునే అతి పెద్ద పండుగ సంక్రాంతి అన్నారు. రోజురోజుకు మారిపోతున్న ఈ కాలంలో కూడా ప్రతి ఏటా సీబీఐటీలో విద్యార్థులకు సంప్రదాయాలను గుర్తు చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించడం మంచి పరిణామమన్నారు. స్థానిక సీబీఐటీలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామీణ నేపథ్యంలో విద్యార్థుల చేత కుటీర గుడిసెలను ఏర్పాటు చేసి పల్లె వాతావరణం కల్పించారు.

అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

రైతులు, ప్రజలు ఈ ఏడాది పాడవునా పాడి పంటలతో తులతూగుతూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆకాంక్షించారు. మైదుకూరు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. 2023లో తొలి రోజుల్లో వచ్చే పండుగ సంక్రాంతి నెల రోజుల పాటు ధనుర్మాస వ్రతం చేసి ఈ పండుగను నిర్వహిస్తామన్నారు. అలానే ఈ ఏడాది అందరికి సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

నేటి నుంచి సంక్రాంతి ఉత్సవాలు

మైదుకూరు : సంక్రాంతి ఉత్సవాలు శనివారం నుంచి మైదుకూరులో నిర్వహించనున్నారు. స్థానిక శ్రీ లక్ష్మీ మాధవరాయస్వామి ఆలయంలో ఏటా నిర్వహించే సంక్రాంతి ఉత్సవాలు జిల్లాలో ప్రఖ్యాతి గాంచాయి. శనివారం భోగి పండుగ, 15న ఆదివారం మకర సంక్రాంతి, 16న సోమవారం కనుమ పండుగను నిర్వహిస్తారు. మూడో రోజు కనుమ పండుగ అనంతరం శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడై మైదుకూరు పరిసర గ్రామాల్లో పారువేట కార్యక్రమంలో భాగంగా ఉత్సవమూర్తులు ఊరేగనున్నాయి. పారువేట అనంతరం ఫిబ్రవరి 3న మైదుకూరు చేరుకోగానే గ్రామోత్సవం జరగనుంది.

నేటి నుంచి వెదురూరులో..

చాపాడు : మండలంలోని వెదురూరు గ్రామంలో సంక్రాంతి సంబరాలు శనివారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. గ్రామంలో పురాతన దేవాలయమైన శ్రీపార్వతి సమేత సంగమేశ్వర దేవస్థాన సన్నిధిలో ఉత్సవాలు జరగనున్నాయి.

ఆర్‌ఎస్‌ఎస్ దేశభక్తిని మాత్రమే నేర్పుతుంది

పోరుమామిళ్ల : ఆర్‌ఎస్‌ఎస్ దేశభక్తిని మాత్రమే నేర్పుతుందని ఆ సంస్థ జిల్లా ప్రతినిధి బాలరంగయ్య తెలిపారు. శుక్రవారం ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో సంక్రాంతి పర్వదినంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ దేశం నాది, ఈ దేశ మహోన్నత సంస్కృతికి నేను వారసున్ని అనే ఉన్నత భావాన్ని దేశ ప్రజల్లో కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

15న వెల్లాలలో పార్వేట

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించి 15న ఆదివారం పార్వేట మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, ఈఓ నరసయ్య తెలిపారు. శుక్రవారం వారు ఆలయాల్లో విలేకరులతో మాట్లాడుతూ మకర సంక్రాంతి రోజున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామిని హనుమత్ వాహనంపై గంగా పార్వతి సమేత శ్రీభీమలింగేశ్వర స్వాములను నంది వాహనంపై ఊరేగింపుగా బయలుదురుతారన్నారు. పార్వేట మహోత్సవాన్ని ఆయా గ్రామస్తులు, భక్తులు వచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి
- వైఎస్సార్‌సీపీలో చేరిన నాయీబ్రాహ్మణులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రజా సేవ చేసేందుకు యువత రాజకీయాల్లోకి రావాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. సోములవారిపల్లె పంచాయతీ ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన నాయీబ్రాహ్మణులు సుధీర్, సుబ్రహ్మణ్యం, మధు, గోపాల్‌తోపాటు 40 కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉండగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను చూసి నాయీబ్రాహ్మణులు పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, ఉపసర్పంచ్ మార్తల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ పల్లా లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య, న్యాయవాది జీవీ సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పట్టణ పరిధిలోని బాలాజీ నగర్‌కు చెందిన కాయల మద్దిలేటమ్మకు రూ.1.20 లక్షలు, గోపవరం గ్రామానికి చెందిన రాయపాటి సుధాకర్‌కు రూ.2లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, మెప్మా టీఈ కెజియా జాస్లిన్ వ్యవహరించారు. పోటీల్లో 50 మంది మహిళలు పాల్గొన్నారు. మొదటి బహుమతి సి.స్వాతి, రెండో బహుమతి కె.భవాని, మూడో బహుమతి ఎస్.కళ్యాణి, పి.పద్మజ సాధించారు. విజేతలకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి బహుమతులను అందించారు. కార్యక్రమంలో సీఓలు, మహిళలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు అంకితభావంతో పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, అడా చైర్మన్ సింగసాని గురుమోహన్‌లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఇప్పటి నుంచే ప్రతి కార్యకర్త నిత్యం ప్రజలతో మమేకమై ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ ఉండాలని సూచించారు. ఇదే సమయంలో ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సివిల్‌సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకవర్గానికి కృతజ్ఞతలు



మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్న కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలోని 17వ వార్డు పరిధిలో రూ.30లక్షలతో మజీద్ ఇమామ్ బుఖారి మందిరానికి రోడ్డు నిర్మించిన మున్సిపల్ పాలకవర్గానికి జమాత్ అహ్లె హదీస్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారుమునిరెడ్డి, వార్డు కౌన్సిలర్ చింతకుంట సరిత జయలింగారెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని కాలువలను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు..



సంక్రాంతి సంబరాల్లో అధ్యాపకులు, విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో శుక్రవారం ముందస్తు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అర్కటవేముల హరినారాయణ మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలు నేటి యువతకు తెలిసేలా ముందస్తు సంక్రాంతి సబరాలు నిర్వహించామన్నారు. విద్యార్థినులు కోలాటం, క్లాసికల్ డ్యాన్స్, సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించి అందరిని అలరించారు. ఎన్‌సీసీ కోఆర్డినేటర్ గౌరీశంకర్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్, రామ్మోహన్, శివ, సాయి, సలీం, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

ధ్యాన మందిరం ప్రారంభం

కడప అర్బన్: కడపలోని నూతన పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పిరమిడ్ ధ్యాన మందిరం, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, వాలీబాల్ కోర్ట్, టెన్నిస్ కోర్ట్, షటిల్ కోర్ట్‌లను శుక్రవారం సాయంత్రం కర్నూలు రేంజ్ డి.ఐ.జి ఎస్. సెంథిల్‌కుమార్ ప్రారంభించారు. పోలీసు సిబ్బంది ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలనీ డి.ఐ.జి సూచించారు. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

స్పర్శలేని పొడలపై వైద్యుల సలహాలు తప్పనిసరి



లెప్రసీపై పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖాధికారి ఖాదర్‌వల్లి

అట్లూరు : స్పర్శలేని, చెమట పట్టని రాగిరంగు పోలిన పొడలపై వైద్యుల సలహాలు తప్పనిసరి అని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.కె.ఖాదర్‌వల్లి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరికైనా శరీరంలో ఎక్కడైనా స్పర్శ లేకుండా పొడలు ఉంటే అవి కుష్టువ్యాధి (లెప్రసీ)కి సంబంధించిన పొడలుగా గుర్తించాలని, వైద్యులను సంప్రదిస్తే వాటికి పరీక్షలు నిర్వహించి వ్యాధి నివారణకు చర్యలు చేపట్టి ఉచితంగా వైద్యంతో పాటు మందులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ కె.హమీదాబేగం, సీహెచ్‌ఓ మురళీకృష్ణ, డీపీఎంఓ నాగరాజు, టెక్నికల్ సపోర్ట్ శంకర్, మధుసూదన్, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, ఏఎన్‌ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ గోదాదేవి కల్యాణోత్సవం



స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : ధనుర్మాసం ముగింపునకు వస్తున్న సందర్భంగా శుక్రవారం కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి, స్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత మూలమూర్తులతో పాటు ఉత్సవ మూర్తులకు కూడా విశేష అభిషేకాలు చేసి వధూవరులుగా అలంకరించి పెళ్లిపీటలపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ బృందం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరైన భక్తులు కార్యక్రమం ముగిసేంతవరకు విష్ణు సహస్ర నామ పారాయణం చేయడం విశేషం. తొలుత ఉభయదారులకు, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కల్యాణంలో వాడిన అక్షతలు, ముత్యాలను భక్తులకు కానుకగా అందజేశారు.

ఫ్లెక్సీలపై నిషేధాన్ని తొలగించాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు : ఫ్లెక్సీలపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని తొలగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి సృజన శ్రీను, సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడారు. ప్రభుత్వం విధించిన ఫ్లెక్సీల నిషేధం వల్ల నిరుద్యోగులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ సుభానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్మానుయేల్, విజయకుమార్‌తోపాటు ఫ్లెక్సీ ప్రింటర్స్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

ఆప్యాయ పలకరింపులు.. ఆనంద క్షణాలు



లక్ష్మీపేటలో కలుసుకున్న 1998 బ్యాచ్ విద్యార్థులు

చాపాడు : తమతోపాటు చదువుకున్న తోటి స్నేహితులు అందరూ కలవడం సంతోషంగా ఉందని ఎస్‌ఐ డాక్టర్ నాయక్ తెలిపారు. మండల పరిధిలోని లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998లో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు శుక్రవారం హైస్కూల్ ఆవరణలో కలిశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌ఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల తర్వాత పాత స్నేహితులు ఒక చోట కలిస్తే ఆ సందర్భం ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. పూర్వ విద్యార్థులు తరచూ కలిసేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంక్రిమెంట్‌తో కూడిన పదోన్నతులను కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు అక్టోబర్ నెలలో జరిగిన పదోన్నతులకు అంగీకారం తెలిసిన ఎస్‌జీటీలకు పూర్తిస్థాయితో కూడిన పదోన్నతులను కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదోన్నతులకు అంగీకారం తెలిపి మూడు నెలలు పూర్తయిన తర్వాత కూడా పూర్తిస్థాయిలో ఇంక్రిమెంట్లతో కూడిన పదోన్నతుల ఇవ్వకపోవడం సరైన విధానం కాదన్నారు. ఈ ఉత్తర్వుల వల్ల ఉపాధ్యాయుల్లో గందరగోళ వాతావరణం నెలకొందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ గురయ్య, ఖాదర్‌బాషా, కడప మండల అధ్యక్షుడు ప్రసాద్, చింతకొమ్మదిన్నె మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జిల్లా కౌన్సిలర్లు రమణ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు వితరణ



వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందిస్తున్న బండారు సూర్యనారాయణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అయ్యప్పస్వామి ఆలయ సమీపంలోని మదర్ థెరిసా సేవా వృద్ధాశ్రమానికి ఆర్‌కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారి సహకారంతో రూ.40వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులను తొగటవీరక్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము సంపాదించిన దానిలో వృద్ధులకు సహకారం అందించాలనే ఉద్దేశంతో బియ్యం, కందిపప్పు, నూనె తదితర నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సంస్థ నిర్వాహకుడు విష్ణువర్ధన్, చౌడం రవి, బండారు రామాంజనేయులు, రామయ్య, రేణుక, పాములేటి, లక్ష్మీనారాయణ చలపతి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో విస్తారంగా దోస సాగు



సీతారామాపురం వద్ద ఎడ్లతో దోస విత్తనం వేస్తున్న దృశ్యం

చాపాడు : మైదుకూరు నియోజకవర్గంలో రైతులు వరి తర్వాత దోసకాయనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో చాపాడు, మైదుకూరు, ఖాజీపేట మండలాల్లో అధికంగా రైతులు దోస సాగు చేపట్టగా, దువ్వూరు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్నారు. సాధారణ రకం దోస పంటతో పాటు జ్యూస్ రకం దోస పంటపై ఈ ఏడాది రైతులు దృష్టి సారించారు. చాపాడు మండలంలోని అయ్యవారిపల్లె, రామదాసుపురం, తిమ్మాయపల్లె, రాజువారిపేట, చాపాడు, సీతారామాపురం, చియ్యపాడు, మైదుకూరు మండల పరిధిలోని సరస్వతిపేట తదితర ప్రాంతాలలో సాగు చేస్తుండగా, ఖాజీపేట మండలంలోని బుక్కాయపల్లె, గుంటూరు కొట్టాలు, నడిపెన్నకొట్టాలు, భూయపల్లె, తవ్వారుపల్లె గ్రామాల పరిధిలో రైతులు అధికంగా దోస సాగు చేశారు. గతేడాది నిలువ చేసిన విత్తనాలతో పాటు వివిధ కంపెనీల ప్యాకెట్ల విత్తనాలతో సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో వెయ్యి ఎకరాలకు పైగా దోస పంట సాగులో ఉన్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

రేపు కాలాష్టమి పూజలు

కడప కల్చరల్ : బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత గ్రామం మగ్దూం సాహెబ్ కొట్టాలలో ఆదివారం కాలభైరవస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నామని సంస్థ అధ్యక్షులు బాలాజీరావు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 8గంటలకు అభిషేకం, అష్టోత్తరం, కుష్మాండ సేవ తదితర పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

22 నుంచి మహా కుంభాభిషేకం



ఆహ్వాన పత్రికతో ఆర్యవైశ్య సభ సభ్యులు

మైదుకూరు : పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్‌గుప్తా తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఆర్యవైశ్యసభ కార్యవర్గంతో కలిసి ఆయన కుంభాభిషేక మహోత్సవ ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఆలయం నిర్మించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22వ తేదీన శివపార్వతుల కల్యాణం, 23న వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా హోమం, అగ్ని గుండ ప్రవేశం, 24, 25, 26 తేదీల్లో హోమాలు ఉంటాయన్నారు. 27న ఉదయం హంపీ పీఠాధిపతులు విరూపాక్ష విద్యారణ్య స్వామిచే కుంభాభిషేకం, మహాపూర్ణాహుతి, ప్రసాద వినియోగం ఉంటాయని తెలిపారు.

నేడు కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బొల్లవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు గోదాదేవి, శ్రీకృష్ణుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో అన్నమాచార్య కీర్తనల ఆలాపన, కోలాటం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. పాత మార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు గోదాదేవి రంగనాయకుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వెంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితా దేవికి ప్రత్యేక పూజలు, రాత్రి 8 గంటలకు పాన్పు సేవ ఉంటుందని పేర్కొన్నారు.